# నులకమంచం

- పెద్దిభొట్ల సుబ్బరామయ్య




'ఏమయ్యా! దొరకలేదా?' అని దాదాపు అరిచినంత పనిచేశాడు నిర్మాత. అతడు మాట్లాడుతున్నది ఫోనులోనే కాని ఆ అరుపు చుట్టుప్రక్కల అందరినీ అదిరిపడేట్టు చేసింది.

'ఛీఛీ, అని విసుక్కున్నాడాయన సెల్ ఫోను మడిచి అవతల పడేస్తూ...' దౌర్భాగ్యపు దేశం.. ఇంత చిన్న విషయంలో రెండు రోజుల నుంచీ ఇందరు ట్రై చేస్తూ ఉంటే... కుదరడం లేదే! అదే ఫారిన్ కంట్రీ అయితే, అది స్విట్జర్లాండ్ అయినా ఆస్ట్రేలియా అయినా ఏం కావాలంటే అది క్షణాల్లో దొరుకుతుంది మరి... 'అవును సార్ అక్కడ కరెన్సీ పారేస్తే అన్నీ దొరుకుతాయి. కాని..' అంటూ ఆగి అమిత ఖరీదైన విస్కీ గుటక వేశాడు డైరెక్టర్. రెండుమూడు బాటిళ్లు తెచ్చుకున్నాం కాబట్టి సరిపోయింది. లేకపోతే ఈ అటవీ ప్రాంతంలో దిక్కుమాలిన చెట్లు, కుగ్రామాల మధ్య గొంతెండి చచ్చేవాళ్లం ! అనుకున్నాడు లోలోపల.

చుట్టూ చీకటి... ఆ నాలుగు గదుల చిన్న ఇల్లు అదృష్టవశాత్తు దొరికింది. అందులో ఒక గదిలో మహా ఘనత వహించిన కథానాయిక తన మరీ ఘనత వహించిన కన్నతల్లితో కలిసి... అక్కడికి మరెవరికీ ప్రవేశం లేదు. మరో గదిలో అమితఘనత వహించిన నటచక్రవర్తి కథానాయకుడు... వారికి చెందిన ఎవరో మరో శాల్తీ... అక్కడికీ ఇతరులకు ప్రవేశం నిషిద్ధం... ఇక మిగిలిన రెండు గదులలోనూ నిరంతరం తలపట్టుకుని బాసీపట్టు భంగిమలో నిర్మాత.. పక్కన రచయిత.. ఇక మిగిలిన జట్టు జట్టు అంతా ఆ చిన్న ఊళ్లో పెంకుటిళ్లలో పూరి పాకలలో సర్దుకుని ఉన్నారు. ఉదయం నుంచి షూటింగ్ పూర్తిగా ఆగిపోయింది. దానికి కారణం సూర్యభగవానుడు కనికరించకపోవడమో, ఆకసాన మబ్బులు కమ్మి వరుణదేవుడు విజృంభించడమో కానేకాదు. మరి అడ్డంకి ఏమిటి? ఎందువల్ల రెండు రోజుల క్రితమే పూర్తికావలసిన పని మిగిలిపోయింది? ఎందువల్ల తామందరు ఈ దారుణ అటవీ ప్రాంతంలో నిలిచిపోవలసి వచ్చింది? ఈ రెండు రోజులూ తిండి, వగైరాలకు చాలా ఇబ్బంది పడవలసి వచ్చింది. పదిమైళ్ల దూరం వాహనాలలో వెళ్లి తిండి పదార్థాలు తేవలసి వచ్చింది. ఇంత యాతన ఎందువల్ల అనుభవించవలసి వచ్చింది?

\- - -

అక్కడికి 15 కిలోమీటర్ల దూరంలో ఒక పూరి

గుడిసె ముందు అసిస్టెంట్ డైరెక్టర్ కేవలం చింకి చాపమీద ఆసీనుడై ఉండి చిరాకు చిత్తగిస్తున్నాడు. 'ఎట్లా వీళ్లతో చావడం?' అనుకుంటూ తెగబాధ పడిపోతున్నాడు, విసుక్కుంటూ జేబులు తడవు కున్నాడు మూడోసారి.. అవతల నేలమీద ఖాళీ సిగిరెట్టు పెట్టె వెక్కిరిస్తూ కనిపించింది. గొంతు ఎండుకుపోతున్నది. నోరంతా వగరుగా అరుచిగా ఉంది. రాత్రి కనీసం ఒక పెగ్గు అయినా పడలేదు. ప్రొడ్యూసర్ తనను తరిమాడు. 'సాధించుకు రాకపోతే ఇంతేసంగతులు' అని అరిచాడు.

ఇక్కడ చూడబోతే పరిస్థితి సుఖంగా ఏ మాత్రమూ లేదు.

ఎదురుగా చుట్టు గుడిసెలో అయిదారుగురు మగవాళ్లు అంతే సంఖ్యలో ఆడవాళ్లు కూర్చుని మల్లగుల్లాలు పడుతున్నారు.

మగవాళ్లు అరుస్తున్నారు, ఆడవాళ్లు కళ్లు తుడుచుకుంటున్నారు, వాతావరణం అంతా నసగా బోరింగ్‌గా ఉంది.

ఇతను లేచి గుడిసెముందుకు వచ్చి నిలబడి 'అసిరీ' అని కేకపెట్టాడు.

లోపలినుండి 'ఆగండి...ఆగండి' అని విన వచ్చింది.

'ఆగుతూనే ఉన్నాను.. ఆగక చస్తానా?'

మొత్తానికి మరో పావుగంటకు ఆడవాళ్ల ఏడుపుల మధ్య ఏదో సర్దుబాటు అయింది. అందరూ లేచారు. ఆ మూల కుక్కి మంచంలో చివరి శ్వాస పీలుస్తూ కొనూపిరితో, ఇప్పుడో మరి కొద్ది నిముషాలో అనేట్టు. 'హరీ' అనేందుకు సిద్ధంగా ఉన్న ఎముకల గూడును తలా ఒక వైపు తలా ఒక విధంగా పట్టుకుని లేపబోయారు. ముసలివాడు అకస్మాత్తుగా కదలి కొంచెం కాళ్లూ చేతులూ తన్నుకు న్నాడు. వాళ్లు అతని శరీ రాన్ని కుక్కిమంచంలోనుంచి ఇవతలికి దించి నేలమీద అంతకుముందే పరిచి ఉంచిన ఎండు గడ్డి మీదికి చేర్చారు. ఆ తర్వాత ఆ కుక్కిమంచం ఇవతలికి వచ్చింది. ఎప్పుడెప్పుడా అని నక్కలాగా కాచుకుకూర్చున్న అసిస్టెంట్ డైరెక్టర్ గభాలున లేచి నిలబడ్డాడు అమ్మయ్య అనుకుంటూ. కర్రలు వంపుతిరిగిన నులకమంచం కారు మీదికి ఎక్కింది. గుంపులో ఒకడికి ముసలివాడి కొడుక్కి వంద రూపాయలనోటు అందింది. ఆ నలుగురు మగవాళ్లకు పదిమైళ్ల దూరంలో ఉన్న చిన్న పట్నంలో పెద్దబారు.. అందులో రంగు రంగుల సీసాలు... తాము సకృత్తిగా తప్ప ఎరుగని రకరకాల మాంసా హార పదార్థాలు కన్నుల పండుగుగా కళ్ల ముందు కదలాడాయి. ఆడవాళ్ళు నలుగురైదుగురూ లోపలే ఉన్నారు. ముసలివాడి పక్కనే... వీళ్ల చేతిలో పెద్ద నోటు పడటం... లోపల ముసలివాడు అర నిముషం సేపు ఎగిరెగిరి పడి 'హరీ' అనడం... ఆడవాళ్ళు గొల్లు మనడం ఒక్కసారే జరిగాయి. పైన నులక మంచంతో కారు కదిలి వెళ్లిపోయింది.

\- \- \-

**ఆ** మంచం చేరవలసిన చోటికి చేరగానే డైరెక్టర్ నిర్మాత ఇద్దరూ పెద్ద బాధ తొలగిపోయినట్టు నిట్టూర్చి హడావిడిగా 'కానివ్వండి' కానివ్వండి అని గొడవ చేసి అందర్నీ తొందరపెట్టి ఆ సాయంకా లానికి లైట్లు వగైరాలు ఏర్పాటు చేసి ఆ దృశ్యం చిత్రీకరించేందుకు ఉద్యుక్తులైనారు.

దృశ్యం... అంతులేని సంపదలతో జీవితమంతా స్వర్గభోగాలు అనుభవించిన ఒక వ్యక్తి, పతివ్రత అయిన భార్య... వినయ గుణ సంపన్నులైన ఇద్దరు కొడుకులు, గారాబంగా పెరిగి పెళ్లిచేసుకొని అత్తింటికి పోయి సంతాన వతి అయిన కూతురు, జగజెట్టీలవంటి ఇద్దరు తమ్ములు వారి సంసా రాలు, ఊరంతా కొలిచే ఆ వ్యక్తి చివరి దశ... ఆఖరి శ్వాస విడిచే దృశ్యం...... పాలరాతి

ఇంగువ, నీళ్ళు వంటి ప్రసిద్ధ కథల రూప శిల్పి, ప్రముఖ కథకులు శ్రీ పెద్దిభొట్ల సుబ్బ రామయ్య గారి గురించి పరిచయ వాక్యాలు రాయడం ముంజేతి కంకణానికి అద్దం చూపినట్లే. అనేక దేశ, విదేశీ భాషలలోకి అనువదింపబడ్డ ఈయన కథలకు అభిమా నులు ప్రపంచ వ్యాప్తంగా ఉన్నారు. చాలా సాదాసీదాగా, నిరాడంబరంగా, ఆత్మీయంగా కనపడే శ్రీ పెద్దిభొట్ల, ఎక్కడ ఉన్నా, ఏం చేస్తున్నా తనదైన పరిశీలనా దృష్టిని, సమాజంపై తన 'చూపు'ని మాత్రం మరిచిపోరు.

మహళ్లు పోయాయి. అష్టైశ్వర్యాలు అంతరించాయి. అయినవాళ్లు వదలి పోయారు. అంత్యదశలో ఒక పూరిగుడిసెలో నులక మంచంలో అంతిమ శ్వాస విడుస్తున్నాడు. ఎవరూ మిగలలేదు. మాట పడిపోయింది. కంటనీరు ఆగడం లేదు. గోడు అర్థం చేసుకునేవారెవరూ లేరు. శరీరంలో కదలికలు మాని కొయ్యబారి పోతున్నది. ఈ దారుణ బాధాకర దృశ్యంలో నటించే నటుడు చిత్రసీమలో పాతకాపు. ఒకప్పుడు ఒక వెలుగు వెలిగి ఇవాళ ఆరిపోతున్న దశలో ఉన్నాడు. అప్పుడు కొవ్వొత్తి రెండు వైపులా వెలిగించి సుఖాల వెలుతురులో తేలియాడి ఇప్పుడు రెండు పూటలా తిండి దొరికితే చాలనుకునే దశలో ఉన్నాడు.

చీకటి గదిలో అవసరమైన వెలుతురు ఏర్పాట యింది. అవసరమైన వ్యక్తులు మాత్రం ఉన్నారక్కడ. 'కానివ్వండి, కానివ్వండి' అని తొందరపెడుతూ నిర్మాత మాత్రం సందడి చేస్తున్నాడు. వేషం వేసుకుని నటుడు బీడీ కాలుస్తూ ఒక వైపు కూర్చుని ఉన్నాడు. కెమెరా సిద్ధంగా ఉంది 'రైట్.. రైట్' అన్నారెవరో.

దర్శకుడు 'యాక్షన్' అని అరిచాడు. కెమెరా ముందుకు కదిలింది. వెనక విషాదపాట, నటుడు కుక్కిమంచంలో పడుకుని 'ఆఖరి శ్వాస నటిస్తు న్నాడు' దగ్గుతున్నాడు. వెనకపాట విషాద భరితమై 'హోరు'మని మోగుతున్నది.

అంతవరకూ కథానాయిక - హీరోయిన్ - అమిత పేద పిల్ల.. చింకి పాతలలో అలరారుతూ సాఫ్ట్ డ్రింక్ చప్పరిస్తూ కూర్చుని వున్నదల్లా ఇప్పుడు కుక్కిమంచం పక్కన కూలబడి గ్లిజరిన్ కన్నీళ్లు కారుస్తూ దారుణంగా ఉండి ఉండి తలబాదుకుంటూ విలపిస్తున్నది.

ఇది కాస్తా అయితే చాలు బిచాణా ఎత్తేసి నగరానికి వెళ్లిపోవచ్చని అందరూ ఊపిరి బిగపెట్టు కుని ఉన్నారు.

అంతకుముందు ఉదయం నుంచి చిత్రించిన చిన్న చిన్న సన్నివేశాలతో ఇక్కడపని పూర్తి అయి నట్టే.. ఇక కాస్తముక్కా అయిపోతే...

కుక్కిమంచంలో నటుడు దగ్గిదగ్గి ఆయాసపు డైలాగులు చెప్పి చెప్పి ఉన్నట్టుండి బిగుసుకు పోయాడు. తలవాల్చేశాడు.

'భలే...షాట్ ఇది' అని అందరూ ముగ్ధులైనారు. హీరోయిన్ పక్కకు వెళ్లి కిటికీ పక్కన నిలబడి గాలి పీల్చుకుంటున్నది.

చనిపోయిన నటుడు మళ్లీ లేవలేదు. క్షణాల్లో గందరగోళం అయింది. పట్టి పట్టి తట్టి తట్టి కొట్టి కొట్టి ప్రయత్నం చేశారు. ఫలితం లేకపోయింది.

'దేవుడా!' అనుకున్నాడు బరువుగా నిర్మాత.

'అబ్బో! ఇప్పటివాడా?'

'ఎంత సీనియర్ ఆర్టిస్ట్!? వగైరా వ్యాఖ్యలు. మంచం తెచ్చిన అసిస్టెంట్ డైరెక్టర్ మాత్రం లోలోపల ఆ మంచంలో ఆ ముసలివాడు పోవలసి ఉంది అదిప్పుడు ఈయనను మింగింది' అనుకున్నాడు.

❖ ❖ ❖

## రచయితలకు, కవులకు, సాహితీ మిత్రులకు విజ్ఞప్తి

'కథలు' మన పత్రిక సైజులో 3 పేజీలలో మాత్రమే వచ్చేటట్లు పంపించండి. అంటే 6 అరటావులకు మించకుండా ఉండాలి. 'కవితలు' 25 నుండి 30 లైన్ల లోపు ఉండాలి. దీనివలన ఆ కవితకి తగ్గ ఒక 'వ్యక్తీకరణ'ను ఇవ్వడానికి అస్కారం ఉంటుంది.

సమీక్షలు, వ్యాసాలు చాలా క్లుప్తంగా కేవలం రెండు లేదా మూడు పేజీలలోనే ముగించాలి. ఎందుకంటే మనకు తెలుసు క్లుప్తత, అప్తత, గాఢత ఏ రచనకైనా ప్రాణ సమానం.

సమీక్ష నిమిత్తం రెండు ప్రతులు పంపించండి.

- ఎడిటర్